విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 09, జూన్ 2025

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు..

జిల్లాలో కృతిమ యూరియా కొరతను అరికట్టి రైతులను ఆదుకోండి : రంగనాయుడు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ఈనెల 23 నుండి 25 వరకు ఒంగోలులో జరిగే సిపిఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కె.రామాంజనేయులు పిలుపునిచ్చారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కె.రామాంజనే యులు మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల అమలుపై ఈ మహాసభల్లో చర్చించడం జరుగుతుందని పేర్కొన్నారు. సిపిఐ 100సంవత్సరాలయిన సందర్భంగా మహాసభల్లో వంద కళారూపాలతో వెయ్యి మంది కళాకారులతో భారీ ప్రదర్శన నిర్వహిస్తుందన్నారు. నంద్యాల నుండి కూడా రాష్ట్ర మహాసభలకు భారీగా తరలి వెళ్లేందుకు నిర్ణయం తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. మహాదేవపురం అనే గ్రామంలో ఒకే ఇంట్లో 80 ఓట్లున్నాయని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారని, నిన్న ఇచ్చిన ప్రెస్ మీట్‌లో భారీ స్థాయిలో ఎన్నికల కమిషన్‌పై ఆరోపణలు గుప్పించారని పేర్కొన్నారు. బీహార్ ఎన్నికల్లో పౌరసత్వాన్ని నిరూపించుకోవాలని ఎన్నికల కమిషన్ చెప్పడాన్ని ఆయన తప్పుపట్టారు. ఎన్నికల కమిషన్ తన పరిధి దాటి ప్రవర్తిస్తుందని ఆయన ఆరోపించారు. బీహార్‌లో 60 నుండి 70లక్షల ఓట్లు గల్లంతయ్యాయని, వీటిని పార్లమెంట్లో చర్చిందేందుకు ఎందుకు అధికార పార్టీ అంగీకరించడం లేదని ఆయన నిలదీశారు. కేంద్రం అన్ని వ్యవస్థలను తన గుప్పెట్లో పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందన్నారు. ఆపరేషన్ ఖగార్ పేరుతో మావోయిస్టులను అంతమొందించి అక్కడి విలువైన సంపదను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నుతుందని ఆరోపించారు. జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు మాట్లాడుతూ ఆగస్టు 23 నుండి 25 వరకు ఒంగోలులో జరిగే రాష్ట్ర మహాసభలు రాబోయే రాజకీయ పరిణామాల గురించి చర్చించేందుకు వేదిక కాబోతుందన్నారు. రైతులు మన జిల్లాలో తీవ్రంగా యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్నారని, జిల్లా అధికారులు యూరియా సరఫరాలో విఫలమయ్యారని ఆరోపించారు. ముందస్తు వర్షాలు పడడం వల్ల 15 వేల హెక్టాల భూములు అదనంగా పంటలు వేసేందుకు సిద్ధమయ్యాయన్నారు. జిల్లాలో యూరియా కొరత వల్ల రైతు ఇబ్బందులు పడుతున్నారని వీటికి అధికారులు, మంత్రులు బాధ్యత వహించాలని ఆయన పేర్కొన్నారు. కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు సిపిఐ అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. విశ్రాంత ఐపీఎస్ అధికారి రఘువీరారెడ్డిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించిందని, ఈయన అవినీతిపై తాము ఆనాడే చెప్పడం జరిగిందని, రేషన్ బియ్యం,అక్రమ వ్యాపారాలపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు మోట రాముడు, రమేష్, సుంకయ్య, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇరువురి జీవితాల్లో వెలుగు

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో 21వ నేత్ర సేకరణ కార్యక్రమం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : రెడ్ క్రాస్ జిల్లా మాజీ వైస్ చైర్మన్, సెవెన్ హిల్స్ హాస్పిటల్ ఎండి, కాత్యాయని గ్రూప్ అధినేత మారుతి కుమార్ తండ్రి రెంటాల లక్ష్మీనారాయణ ఆకస్మికంగా చనిపోవడంతో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నేత్రాలు సేకరించడం జరిగిందని రెడ్ క్రాస్ ఆర్గాన్ డొనేషన్ మోటివేషన్ కోఆర్డినేటర్ ఆనంద్ గురూజీ తెలిపారు. శుక్రవారం స్థానిక మారుతి టౌన్షిప్‌లోని తన నివాసంలో రెంటాల లక్ష్మీ నారాయణ హార్ట్ ఎటాక్‌తో ఆకస్మికంగా మృతి చెందడంతో మారుతి కుమార్, రెడ్ క్రాస్ మాజీ చైర్మన్ దస్తగిరి పర్ల దృష్టికి తీసుకుపోవడంతో కర్నూల్లోని రెడ్ క్రాస్ ఐ బ్యాంకు బృందానికి తెలియపరచగా వారి సిబ్బంది లక్ష్మీనారాయణ నేత్రంలను సేకరించడం జరిగిందని, గత సంవత్సరం ఆగస్టు 25వ తేదీన మారుతి కుమార్ తల్లి శ్యామలమ్మ నేత్రదానంతో నంద్యాల పట్టణంలో ఈ ప్రక్రియను మొదలు పెట్టడం జరిగిందని, అప్పటినుండి ఎంతో మందికి అవగాహన కల్పించామని, దాదాపు 38 మందికి పైగా నేత్రదానానికి ముందుకు రాగా, వారి ఆరోగ్య రీత్యా ఇప్పటివరకు 20 మంది ద్వారా నేత్రాలు సేకరించి 40 మందికి వెలుగును ప్రసాదించడం జరిగిందని ఆనంద్ గురూజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ మాజీ చైర్మన్ దస్తగిరి పర్ల, రెడ్ క్రాస్ ప్యాటర్న్ సభ్యులు రెంటాల చేతన ఆదిత్య, బైసాని రమేష్, లక్ష్మీనారాయణ సోదరులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలు, రైతులు, కార్యకర్తలకు సౌకర్యాలు కల్పించండి

విశాలాంధ్ర - బనగానపల్లె : బనగానపల్లె మార్కెటింగ్ యార్డ్ చైర్మన్ పాలక మండలి సభ్యులు ప్రమాణస్వీకారంకి వచ్చే రైతులు ప్రజలు పార్టీ కార్యకర్తలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని రోడ్లు భవనాలు పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెల 11వ తేదీ సోమవారం మార్కెటింగ్ యార్డ్ చైర్మన్‌గా కాట్రేడ్డి మల్లికార్జున్ రెడ్డి, పాలక మండలి సభ్యులు ప్రమాణస్వీకారం చేస్తున్న సభ ప్రదేశాన్ని శుక్రవారం మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి స్వయంగా పరిశీలించి పలు ఆదేశాలు, సూచనలు అధికారులకు ఇచ్చారు. కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డి, భూషన్న, శ్రీనివాస్ రెడ్డి, పిఏలు మురళీమోహన్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి రామలింగారెడ్డి, ఈవో సతీష్ కుమార్ రెడ్డి, ఎస్సై దుగ్గిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధన కోసం యాదవులు ఉద్యమించాలి

విశాలాంధ్ర - బనగానపల్లె రూరల్ : హక్కుల సాధన కోసం యాదవులు ఉద్యమించాలని అఖిల భారత యాదవ మహాసభ బనగానపల్లె నియోజకవర్గ కన్వీనర్ జి.మద్దయ్య యాదవ్, రిటైర్డ్ ఉపాధ్యాయులు చల్లా బాలస్వామి యాదవ్‌లు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని నందవరం గ్రామంలో యాదవ అన్న సత్రంలో యాదవ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ గౌరవ అధ్యక్షు లుగా సంజీవ రాయుడు యాదవ్, అధ్యక్షులుగా వై.వెంకటరమణ యాదవ్, ఉపాధ్యక్షులుగా పి.బి.హరి యాదవ్, ప్రధాన కార్యదర్శిగా డి.సతీష్ కుమార్ యాదవ్, కార్యదర్శిగా వై.శ్రీనివాసులు యాదవ్, ట్రెజరర్‌గా కె.మధు యాదవ్, కమిటీ సభ్యులుగా ఎన్ తిమ్మ గురుడు యాదవ్, పి.చిన్న గణ మద్దిలేటి యాదవ్, పి.రామ మద్దిలేటి యాదవ్, జి.చిన్న శివయ్య యాదవ్, వై.శ్రీనివాసులు యాదవ్, డి.బాల వెంకటే శ్వర్లు యాదవ్,పి.బి. మధుసూదన్ యాదవ్, డి.శ్రీనివాసులు యాదవ్, ఆర్ రామ కుల్లాయి యాదవ్, పి.బి దినకర్ యాదవ్‌లను ఎన్నుకున్నారు.

కార్యవర్గసభ్యునిగా కరాటే మహబూబ్ బాష

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : రాష్ట్ర అధ్యక్షులు ఖాజావలి ఆదేశాల మేరకు ఉమ్మడి కర్నూలు జిల్లా ముస్లిమ్స్ హక్కుల పోరాట సమితి కార్యవర్గసభ్యునిగా కరాటే మహబూబ్ బాషను నియమించారు. శుక్రవారం కరాటే మహబూబ్ బాషా ముస్లిమ్స్ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూనుస్‌ను మర్యాద పూర్వ కంగా కలిశారు. ముస్లిమ్స్ హక్కుల పోరాట సమితి కార్యాలయములో రాష్ట్ర జనరల్ సెక్రట్రి సయ్యద్ గులాబ్, ఉమ్మడి కర్నూలు జిల్లా గౌరవాధ్యక్షులు సయ్యద్ ఏక్బాల్‌తో కలవటం జరిగింది. ఈ సందర్భంగా యూనుస్ మాట్లాడుతూ ప్రజా క్షేత్రంలో ఉన్న కరాటే మహబూబ్ బాషా సంఘానికి ఆకర్షితులై ముస్లిం జాతికి తనవంతు సహాయం చెయ్యడం కోసమే సంస్థలో చేరటం జరిగిందన్నారు.మా సంస్థలో మహబూబ్ బాషా చేరటం వల్ల ముస్లిం సమాజానికి మరిన్ని మంచి పనులు చేయవచ్చన్నారు.

వైభవంగా వరలక్ష్మి వ్రతం

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలో శుక్రవారం వైభవంగా ప్రజలు వరలక్ష్మీవ్రతాన్ని జరుపుకున్నారు. ప్రతి ఇంట్లో లక్ష్మీదేవి ప్రతిమలను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన పండ్లు, పూలు, పిండి వంటకాలు పెట్టి పూజించారు. ఈ సందర్భంగా పట్టణంలోని భారతి విద్యామందిరంలో వేదపండితులు ప్రతాప్‌శర్మ ఆధ్వర్యంలో అత్యంత భక్తి శ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి వాయనాలు ఇచ్చిపుచ్చుకున్నారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి ఆర్‌సి సుబ్బారావు గుప్తా, ఉపాధ్యక్షులు మేడా ప్రభాకర్, మదళ్ళపల్లె సత్యనారయణ(అన్నయ్య) ,హెచ్‌ఎం ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల చైర్మన్ల కొరకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర - బనగానపల్లె : మండలంలో గల ప్రముఖ దేవాలయాలు అయినటువంటి శ్రీ యాగంటి ఉమామహేశ్వర స్వామి దేవాలయం, నందవరం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవాలయం చైర్మన్ ఎంపికకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తూ ఎండోమెంట్ డిపార్ట్మెంట్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. యాగంటి ఉమామహేశ్వర స్వామి ఆలయ చైర్మన్గా యాగంటి పల్లె గ్రామానికి చెందిన బండి మౌలిశ్వర్ రెడ్డి, నందవరం చౌడేశ్వరి అమ్మవారి ఆలయం చైర్మన్గా నందవరం గ్రామానికి చెందిన పీవీ కుమార్ రెడ్డి పేర్లు దాదాపుగా ఖరారు అయినట్టు సమాచారం.

వైభవంగా సామూహిక వరలక్ష్మి వ్రతం

విశాలాంధ్ర - శ్రీశైలం : శ్రీశైల మహా క్షేత్రంలో వరలక్ష్మీ వ్రత పర్వదినాన్ని పురస్కరించుకొని దేవస్థానం వారు ఉచిత సామూహిక వ్రతాలను నిర్వహించారు. ఇందులో భాగంగా మూడవ శుక్రవారం నాడు ఈ సామూహిక ఉచిత వరలక్ష్మీ వ్రతంలో 1600 మందిపైగా భక్తులు పాల్గొని ఎంతో వైభవంగా సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించు కున్నారు. ఇందులో పాల్గొన్న ముత్తైదువులందరికి కూడా పూజ ద్రవ్యాలను దేవస్థానం వారి సమకూర్చారు. వరలక్ష్మి వ్రత అనంతరం వ్రతంలో పాల్గొన్న అందరికీ కూడా స్వామి అమ్మవార్ల దర్శనం అన్న ప్రసాద భవనం నందు అన్న ప్రసాదము ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం అంతా కూడా అక్కమహాదేవి అలంకరణ మండపంలో ప్రత్యేక ఏర్పాట్లు నడుమ నిర్వహించడం తోపాటు వచ్చిన ప్రతి ఒక్కరికి కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా వ్రతం ఆచరించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. అర్చక స్వాములు వ్రత విశిష్ట గురించి భక్తులకు వివరించారు. శ్రీశైల మహా క్షేత్రంలో వరలక్ష్మీ వ్రతం నిర్వహించుకోవడం అంటే ఎన్నో జన్మల పుణ్యఫలము అని ఈ వ్రతం నిర్వహించుకోవడం వల్ల అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. అందుచేతనే శ్రావణమాసంలో శుక్రవారం నాడు దేవస్థానం వారు ప్రత్యేకంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు అర్చక వేద పండితులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తీరిన తాగునీటి సమస్య

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : వేసవి ప్రారంభం నుండి తాగునీటి సమస్యలతో సతమతమవుతున్న ఆయా గ్రామాల ప్రజలకు పెద్ద ఊరట కలిగింది. ఆరు నెలల నుండి తీవ్ర తాగునీటి సమస్యతో మండలంలోని 33 గ్రామాలకు గాను దాదాపు 20 గ్రామాలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన పూర్తిస్థాయిలో తాగునీరు అందలేదు. వర్షాకాలం ప్రారంభమై రెండున్నర నెలలు కావస్తున్న రెండు రోజుల వరకు మోస్తారు వర్షాలే పడ్డాయి. అయితే గురువారం కురిసిన భారీ వర్షంతో ఆయా గ్రామాలలో వంకలు వాగులు, ఉప్పొంగి ప్రవహించడంతో తాగునీటి సమస్యకు తెరపడింది. భూగర్భ జలాలు పెరిగి ఆయా గ్రామాలలో పడకేసిన ప్రభుత్వ తాగునీటి బోర్లు మళ్లీ పనిచేస్తున్నాయి. ఆయా గ్రామాల పరిధిలోని తాగునీటి బోర్లతో పాటు వ్యవసాయ బోర్లు కూడా పనిచేయని పరిస్థితి నెలకొన్న వేళ భారీ వర్షం అన్నిటికీ పరిష్కారం చూపింది. భారీ వర్షం పడడంతో ఆయా గ్రామాల ప్రజలు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత రెండేళ్లుగా మోస్తారు వర్షాలు పడిన భారీ వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలాలు అడిగంటాయి. మండలంలోని కొలిమిగుండ్ల, ఇటిక్యాల, కలవటాల,చెన్నంపల్లి,అబ్దుల్లాపురం,తోలమడుగు, ఉమ్మాయిపల్లి గ్రామాల పరిధిలో మాత్రమే మోస్తారు వర్షం కురిసింది. దీంతోపై గ్రామాల పరిధిలో భూగర్భ జలాల పరిస్థితి అంతంత మాత్రమే ఉన్నాయి. అయితే పైన ఉన్న 4గ్రామాల ఎగువ ప్రాంతంలో భారీ వర్షం పడడంతో ఈ గ్రామాల పరిధిలో కూడా భూగర్భ జలాలు పెరుగుతాయన్న ఆశతో గ్రామ ప్రజలు ఉన్నారు. భారీ వర్షం రాకతో మండలంలోని ఆయా గ్రామాలలో త్రాగునీటి సమస్యకు వరుణ దేవుడే దాదాపుగా పరిష్కారం చూపినట్లయ్యింది.

సామాన్యుల నడ్డి విరిచేందుకే స్మార్ట్ మీటర్లు..!

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సామాన్యుల నడ్డి విరిచేందుకే స్మార్ట్ మీటర్లకు అనుమతి ఇస్తోందని ఆళ్లగడ్డ జేఏసీ కన్వీనర్ బీరువాల భాషా పేర్కొన్నారు. పట్టణంలోని జేఏసీ కార్యాలయంలో శుక్రవారం ప్రజా సంఘాలు, కుల సంఘాలు, హక్కుల సంఘాల నేతలతో స్మార్ట్ మీటర్లపై వారు చర్చించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ దేశంలో ఆదాని, అంబానీ కుటుంబాలకే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సేవలు చేస్తున్నాయి తప్ప సామాన్యుల గోడు పట్టించుకోవడంలేదని వారు ఆరోపించారు. స్మార్ట్ మీటర్ల వాడకంతో విద్యుత్ బిల్లులు కట్టలేని పరిస్థితిలో సామాన్యుడు ఉన్నారని అన్నారు. స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోకపోతే రానున్న రోజుల్లో సామాన్యులు బతకలేని పరిస్థితి ఏర్పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదానీ అంబానీల సేవలే కాక సామాన్యుల ఆర్థిక స్థితిగతులపై కూడా దృష్టి సారించి స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తాళ్ల శ్రీనివాసులు, న్యాయవాది గౌస్, హ్యూమన్ రైట్స్ పెద్దన్న, ఓబన్న, లాయర్ వలి, నూర్ భాష సంఘం నాయకులు దూదేకుల దస్తగిరి, జేఏసీ నాయకులు బైజన్, నూర్ భాష తదితరులు పాల్గొన్నారు.

మంత్రి స్వగృహంలో వరలక్ష్మీ వ్రతం

విశాలాంధ్ర - బనగానపల్లె : పట్టణంలోని రోడ్లు భవనాల పెట్టుబడులు శాఖ మంత్రి బీసీ జనార్దన రెడ్డి స్వగృహంలో శ్రావణమాసంలో పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం శ్రీ వరలక్ష్మి వ్రతం వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. మంత్రి నివాసంలో వివిధ ఫలపుష్పాలతో అలంకరించి ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో అమ్మవారి మూర్తిని ప్రతిష్ఠించి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆయన సతీమణి బీసీ ఇందిరారెడ్డి దంపతులు శ్రీ వరలక్ష్మీ వ్రతంలో పాల్గొని శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన ముత్తైదువులకు బీసీ ఇందిరారెడ్డి ముత్తైదువు తాంబూలాలు అందచేసి వారి ఆశీర్వచనం పొందారు. వ్రతం అనంతరం పెద్ద సంఖ్యలో విచ్చేసి, పూజల్లో పాల్గొన్న వారికి మంత్రి దంపతులు అన్నప్రసాదలు ఏర్పాటు చేసారు.

10న మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - చాగలమర్రి : ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 10న మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వీరభద్రుడు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్లు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

మంత్రిని కలిసిన జనసేన సమన్వయకర్త

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మాత్యులు నాదెండ్ల మనోహర్‌ను శుక్రవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆళ్లగడ్డ జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. జనసేన పార్టీ సమన్వయకర్త మైలేరి మల్లయ్య సతీమణిని ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించిన సందర్భంగా మంత్రి నాదెండ్లను ఆళ్లగడ్డ జనసేన పార్టీ సమన్వయకర్త మైలేజీ మల్లయ్య, సతీమణి మైలేరి సురేఖతో పాటు జనసేన నాయకులు బావికాడ గుర్రప్ప తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే శాసనమండలి సభ్యులు పిడుగు హరిప్రసాద్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏపీ ఏంఎస్ఎంఈడిసి చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ యార్డ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి నాదెండ్ల మనోహర్, నాగబాబు, పిడుగు హరిప్రసాద్, తమ్మి రెడ్డి శివశంకర్ తదితర వారిని ఈ సందర్భంగా ఆహ్వానించారు.

సుపరిపాలన లక్ష్యంగా అడుగులు : ఫయాజ్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ప్రజల కోసం సుపరిపాలన లక్ష్యంగా అడుగులు వేస్తున్న ప్రభుత్వం టీడీపీ అని, ఇది కేవలం ఒక కార్యక్రమం కాదు, ఒక ప్రజా ఉద్యమమని టీడీపీ రాష్ట్ర నాయకులు ఎస్ఎండి ఫయాజ్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని 7వ వార్డు ఫరూక్ నగర్ వార్డు ఇంచార్జ్ షేక్ సైలాబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫయాజ్ హాజరై ఇంటి ఇంటికి వెళ్లి ఏడాది కాలంలో వార్డులో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను నోట్ చేసుకొని ఆ సమస్యలను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. క్లస్టర్ ఇంచార్జులు కామిని మల్లికార్జున, ఉప్పరి సురేష్, గోవిందు నాయుడు, ఫరూక్ నగర్ టీడీపీ నాయకులు అబ్దుల్ గఫార్, సత్తార్,సుభాన్ ఈశ్వర్, సద్దాం, ఖాజా, సమీవుల్లా, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డలో క్విట్ ఇండియా దినోత్సవం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవం సందర్భంగా స్వాతంత్ర సమరయోధులకు నివాళులర్పించారు. అపుస్మా ఆళ్లగడ్డ నియోజకవర్గం అధ్యక్షులు అమీర్ బాషా ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ, నెహ్రూ, మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్, సర్దార్ వల్లభాయ్ పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ ల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే మహిళా స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమిర్ భాష మాట్లాడుతూ భారత స్వతంత్ర పోరాటంలో క్విట్ ఇండియా ఉద్యమం చారిత్రాత్మక కీలక ఘట్టం అన్నారు. ఉద్యమంలో దేశ నాయకుల త్యాగాలను గుర్తు చేస్తూ వాటిని మరువరాదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫిర్దోస్ అంజుమ్, పీడీ సంతోషి కుమారి, పిఈటి విజయ జ్యోతి, రత్నమ్మ, భారతి తదితరులు పాల్గొన్నారు.

నేడు వేంకటేశ్వరుని కల్యాణం..

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో ఈ నెల 9న వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహిసు న్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులతో కల్యాణం, పల్లకి ఉత్సవం జరుగుతుందన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం కూడా ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు పేరికొన్నారు.భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలు

విశాలాంధ్ర బనగానపల్లె: మండల పరిధిలోని నందవరం గ్రామంలో వెలిసిన శ్రీ చౌడేశ్వరి అమ్మవారి ఆలయం నందు శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు శుక్రవారం నాడు అత్యంత వైభవంగా జరిగాయి. వరలక్ష్మి వ్రతం వేడుకలను ఆలయ ఈవో శ్రీనివాస్ రెడ్డి, అభివృద్ధి చైర్మన్ పివి కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. ముందుగా చౌడేశ్వరి అమ్మవారికి వేకువ జామున ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో శ్రీ చౌడేశ్వరి దేవి ఉత్సవమూర్తి విగ్రహాన్ని కొలువుంచి ఆలయ అర్చకులు అక్కిసుబ్బయ్య, ప్రసాద్, వేద పండితులు ప్రదీప్ శర్మ ,పవన్ శర్మ, రామకృష్ణ శాస్త్రవేత్తంగా వరలక్ష్మి వ్రతం పూజలు నిర్వహించారు. సామూహిక వరలక్ష్మి వ్రతంలో దాదాపుగా 3500 మంది ముత్తైదువులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదాన సత్రం నందు భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆళ్లగడ్డలో జిల్లా స్థాయి యోగా పోటీలు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పట్టణంలోని ఆవుల పుల్లారెడ్డి సేవాసమితి యోగ హాల్ నందు ఈనెల 10వ తేదీన నంద్యాల జిల్లా స్థాయి యోగ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు యోగ అసోసియేషన్ చైర్మన్ ఆవుల విజయభాస్కర్ రెడ్డి, అధ్యక్షులు బాలకృష్ణ, కార్యదర్శి హనుమంత రెడ్డి, కోశాధికారి సుదీప్ తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ బాల బాలికల, స్త్రీ పురుషుల విభాగంలో యోగ ఎంపిక పోటీలను ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఎంపిక పోటీలకు వచ్చే క్రీడాకారులు ఆధార్ కార్డు జిరాక్స్, స్కూల్ బోనఫైడ్ సర్టిఫికెట్, ,ఫొటోలు తీస్కొని రావాలన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు పశ్చిమ గోదావరిలోజరగబోయే 50వ రాష్ట్రస్థాయి పోటీలకు నంద్యాల జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9440826259, 9866136324 నెంబర్లను సంప్రదించాలన్నారు.

అంగరంగ వైభవంగా వరలక్ష్మీ వ్రతం

విశాలాంధ్ర-పాణ్యం : ప్రముఖ శైవ క్షేత్రము మండల పరిధిలోని ఎస్.కొత్తూరులో వెలిసిన సుబ్రహ్మణ్యే శ్వర స్వామి సన్నిధి నందు శుక్రవారం అంగరంగ వైభవంగా వరలక్ష్మీ వ్రతం నిర్వహించడం జరిగింది. ఆలయ ఈవో రామకృష్ణ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు సురేష్ స్వామి, సుబ్బయ్య స్వామి ఆధ్వర్యంలో ఉదయం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి అభిషేకములు, అర్చనలు విశేష పూజలు నిర్వహించారు. హాజరైన భక్తాదులకు దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత ప్రసాద వితరణ, అమ్మవారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో సిఐ కిరణ్ కుమార్ రెడ్డి, ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి, గ్రామ పెద్దలు మిలిటరీ సుబ్బారెడ్డి, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ చైర్మన్‌గా కాటంరెడ్డి అరుణ ..

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని బోయలకుంట్ల గ్రామంలో గల ప్రాథమిక వ్యవసాయ పరస్పర రైతు సేవ సహకార సంఘ సొసైటీ చైర్మన్‌గా కాటంరెడ్డి అరుణ ఎన్నిక అయ్యారు. టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి సతీమణి కాటంరెడ్డి అరుణ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియని మర్యాదపూర్వకంగా కలిసేందుకు వెళ్లగా ఎమ్మెల్యేనే పట్టు శాలువా కప్పి అరుణమ్మకు కృతజ్ఞతలు తెలపడం విశేషం. ఈ సందర్భంగా కాటంరెడ్డి అరుణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో చైర్మన్ పదవిని అప్పగించిన భూమా అఖిలప్రియకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.సొసైటీ అభివృద్ధి కోసం, రైతుల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని అన్నారు.

వాహనదారులు సరైన పత్రాలు కలిగి ఉండాలి

విశాలాంధ్ర- బనగానపల్లె : వాహనదారులు రహదారిపై ప్రయాణించే టప్పుడు సరైన పత్రాలు కలిగి ఉండాలని ఎస్సై దుగ్గిరెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం బేతంచర్ల సర్కిల్‌లో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. మైనర్లకు తల్లిదండ్రులు తమ వాహనాలు నడిపేందుకు ఇవ్వరాదని హెచ్చరించారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

పెట్టుబడి యాప్‌ల పేరుతో సైబర్ నేరగాళ్ల మోసాలు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: ఇటీవల రకరకాల వంటి పెట్టుబడి యాప్‌లు, సోషల్ మీడియా, టెలిగ్రామ్ గ్రూపులు, వాట్సాప్ ద్వారా ప్రచారం చేస్తూ ప్రజలను సైబర్ నేరగాళ్ళు మోసం చేస్తున్న ఘటనలు జిల్లాలో ఇటీవల వెలుగులోకి వచ్చాయని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక లాభాలు వస్తాయనే ఆశ చూపిస్తూ ఈ యాప్‌ల ద్వారా లక్షల రూపాయలు వసూలు చేసి, అనంతరం మూసివేస్తున్నారన్నారు. యాప్‌ల ద్వారా వందశాతం లాభం, రోజుకి 3-5శాతం రిటర్న్ వంటి వాగ్దానాలు, మొదట్లో చిన్న మొత్తాలపై లాభాలు చూపించి, నమ్మకాన్ని కల్పించడం. ఆపై పెద్ద మొత్తాలను డిపాజిట్ చేయమని ఒత్తిడి చేయడం, డబ్బు పంపిన తరువాత యాప్ లేదా వెబ్సైట్ పని చేయకపోవడం జరుగు తుందన్నారు. మోసగాళ్లు విదేశీ నంబర్లు, ఫేక్ కెవైసీ డాక్యుమెంట్లు ఉపయోగించడం. పెట్టుబడులు చేసే ముందు సంబంధిత కంపెనీ లేదా యాప్ ఎస్ఈబీఐ, ఆర్ఈబీఐ గుర్తించిందా అనే దానిపై పరిశీలించాలి. వందశాతం లాభం, నష్టమేం ఉండదు' వంటి ప్రకటనలు మోసపూరితమవేఅన్నారు. టెలిగ్రామ్, వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే పెట్టుబడి సూచనలను పూర్తిగా నమ్మవద్దని, ఎటువంటి అనధికారిక లింకులు లేదా యాప్ లలో డబ్బులు ట్రాన్స్ఫర్ చేయవద్దని, సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ విజ్ఞప్తి చేశారు.

నేడే సీపీఐ జిల్లా మహాసభలు

ప్రదర్శన, బహిరంగ సభ

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: సీపీఐ కర్నూలు జిల్లా 24వ జిల్లా మహాసభలు శనివారం ప్రారంభం కానున్నాయి. ముందుగా ఉదయం 11 గం జిల్లా పరిషత్ నుండి పాతబస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వరకు బారీ ప్రదర్శన నిర్వహించనున్నారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్ వద్ద బారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ ప్రదర్శనకు జిల్లా నలుమూలల నుండి సీపీఐ నాయకులు, కార్యకర్తలు తరలిరానున్నారు. ప్రదర్శనలో ప్రజానాట్య మండలి కళాకారుల డప్పుచప్పుళ్ళు, కోలాటాలు, గొరవయ్యల నృత్యాలు, జనసేవాదళ్ కవాతు నిర్వహించనున్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, ఆహ్వానసంఘం అధ్యక్షులు జగన్నాథం, జి.చంద్రశేఖర్, సి.మహేష్, డి.శ్రీనివాసరావు, షబీర్ బాష తదితరులు మహాసభల ఏర్పాట్లు, బహిరంగ సభ వేదిక, నగరంలోని ప్రధాన కూడళ్ళలో ఏర్పాటు చేసిన తోరణాలు, ఫ్లెక్సీ లను పరిశీలించారు. ఈ బహిరంగ సభలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, డి.జగదీష్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, ఆవుల శేఖర్, నక్కిలెనిన్ బాబు, జిల్లా నాయకులు పాల్గొన నున్నారు. బహిరంగ సభ అనంతరం పున్నమి రెస్టారెంట్‌లో మూడు రోజుల పాటు ప్రతినిధుల సభ నిర్వహించను న్నారు. ఈ జిల్లాలోని సీపీఐ, ప్రజా సంఘాలకు చెందిన సుమారు 250 మంది ప్రతినిధులు ఈ మహాసభల్లో పాల్గొంటారన్నారు.

మొండి గోడలకే పరిమితమైన కమ్యూనిటీ హాల్

విశాలాంధ్ర -హొళగుంద: మార్లమడకి గ్రామం, ఎస్సీ కాలనీలో మాజీ ఎమ్మెల్సీ మసాల పద్మజ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులను మంజూరు చేశారు. కాలనీలో కమ్యూనిటీ హాల్ పనులు చురుగ్గ సాగి భవనంపూర్తి కాక మొండి గోడలకి పరిమితమైందని ప్రజలు గుసగుసలాడుతున్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మిస్తే గ్రామ అభివృద్ధిపై చర్చించడం జరుగు తుందని, సామూహిక కార్యక్రమాలు ఇతర కార్యక్రమాలు జరుపుకోవ డానికి ఎంతో అనుకూలంగా ఉంటుందని గ్రామ ప్రజలు శుక్రవారం విలేకరులకు తెలిపారు. కమ్యూనిటీ హాల్ లేనందున స్థానిక దేవాల యాలు, రచ్చబండలు ఇతర బయలు ప్రదేశంలో కూర్చుని గ్రామాభివృద్ధిపై చర్చించు కుంటామంటున్నారు. కమ్యూనిటీ హాల్ పూర్తికాక మొండి గోడతో నిరుపయోగంగా ఉందని, విద్యావంత యువకులు తెలిపారు. ఇప్పటికైన సంబంధిత చర్యల అధికారులు చర్యలు తీసుకొని కమ్యూనిటీ హాల్ పూర్తిస్థాయిలో నిర్మించాలని ప్రజలు కోరారు.

టైలర్ల సంఘం జిల్లా కార్యదర్శి ఆకస్మిక మృతి

విశాలాంధ్ర - సి.బెళగల్: టైలర్ సంఘం జిల్లా కార్యదర్శి టి.ఆదెన్న (39) శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందారు. గత పది హేనేళ్లుగా టైలర్ సం ఘంలో మండల సభ్యులుగా, మండల అధ్యక్షులుగా పని చేసి ఇటీవల జిల్లా కార్యదర్శి స్థాయికి ఎదిగారు. టైలర్ సంఘానికి, సభ్యులకు ప్రభుత్వం నుండి అనేక సంక్షేమ పథకాల కోసం, అభివృద్ధి కోసం కృషి చేశారు. ఆయన గత వారం రోజుల కిందట పచ్చ కామెర్లతో ఆసుపత్రిలో చేరి, చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందారు. ఈ విషయం తెలిసి టైలర్ సంఘానికి తీరని లోటని, టైలర్ల సంఘం సభ్యులు ఆయన మృతదేహానికి నివాళులు అర్పించారు.

బీజీ మాదన్న ఆశయాలను కొనసాగిస్తాం

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు రూరల్ : సీపీఐ 24వ జిల్లా మహాసభలకు పార్టీ శ్రేణులు సిద్ధమయ్యారు. ముందుగా మహాసభలకు తిమ్మాపురంలోని బీజీ మాదన్న స్థూపానికి నివాళులర్పించి, అక్కడి నుండి సీపీఐ పతాకాన్ని తీసుకుని కర్నూలలుకు వెళతారు. భవిష్యత్తులో బీజీ మాదన్న ఆశయాల సాధనకై ఉద్యమిస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.రంగన్న, సీపీఐ మండల కార్యదర్శి రాజీవ్‌లు తెలిపారు. ఎమ్మిగ నూరు ప్రాంతంలో బీజీ మాదన్న భూస్వామ్య పెత్తందారి విధానానికి వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు నిర్వహించారని, ఆయన పోరాటాలు స్ఫూర్తిదాయకంగా తీసుకొని కర్నూలు జిల్లా మహాసభలకు ప్రారంభానికి ఆయన పోరాటాలు సూచికంగా బీజీ మాదన్న కుటుంబం నుండి ఎర్ర జెండాను తీసుకొని, కర్నూలు మహాసభలకు బయలుదేరడం జరుగు తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ గ్రామ సర్పంచ్ మహేశ్వరమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, మండల సహాయ కార్యదర్శి విరుపాక్షి నాయుడు ఏఐటీయూసీ తాలూకా కార్య దర్శి తిమ్మ గురుడు, సీపీఐ సీనియర్ నాయకులు బజారప్ప, నాయకులు వెంకటేశులు, మల్లికార్జున, ఇస్మాయిల్, శాంతప్పలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర -హొళగుంద: హొళగుంద నుండి కడ్లేమాగికి వెళ్లే రోడ్డు మధ్యలో కల్వర్టు శిథిలావస్థలో ఉంది. శిథిలావస్థలో ఉన్న కల్వర్టుపై కడ్లేమాగి, గజ్జెహళ్లి, బంద్రాల్ తదితర గ్రామాల ప్రజలు రైతులు

శిథిలావస్థలో కల్వర్టు.. పట్టించుకోని అధికారులు

రోజు తిరుగుతున్నారు. బ్రిటిష్ కాలంలో నిర్మించిన రాతి కట్టడం కూలడానికి సిద్ధంగా ఉన్నదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కల్వర్టు నిర్మించాలంటూ ఎన్నోసార్లు అధికారులు దృష్టికి తీసుకొచ్చిన పెడచెవిన పెట్టేశారని, కల్వర్టు మాత్రం నిర్మించలేకపోయారని ప్రజలు విమర్శించారు. జగన్ కాలనీ ప్రజలు శిథిలావస్థల కల్వర్టు దాటుకుంటూ వెళుతున్నారు. కోతి బసప్ప, ఇతర దేవాలయ దర్శనం కోసం భక్తులు భయం భయంగా నడుస్తూ స్వామి వారి దర్శనం చేసుకుంటున్నారు. గతంలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరై పనులు ప్రారంభించిన అధికారులు మాత్రం కల్వర్టు నిర్మించకుండా చేతులెత్తేసారని ప్రజలు విమర్శించారు. వర్షాకాలంలో కల్వర్టు అడుగు భాగాన భారీ స్థాయిలో వరద నీరు ప్రవహించి పాల చెరువుకు చేరుకుంటాయని ప్రజలు తెలిపారు. శిథిలావస్థలో ఉన్న కల్వర్టు కూలిపోతే ఇక రాకపోకలు పూర్తిగా స్తంభించిపోతాయని అన్నారు. సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని వెంటనే కొత్త కల్వర్టు నిర్మించి, రాకపోకలకు అనుకూలం చేయాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేశారు.

పాము కాటికి మృతి చెందిన గొర్రెల కాపరి

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: గొర్రెల కాపరైన బోయ సుంకన్న (45) పాము కాటికి గురై మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు బోయ సుంకన్న గొర్రెల కాపరిగా ఉంటూ వ్యవసాయం చేసుకొని కుటుంబాన్ని పోషిస్తూ ఉండేవాడు అన్నారు. ఈనెల 6 తారీకు ఉదయం గొర్రెలను మేపేందుకు మాల కొండ దగ్గర ఉన్న పొలం వైపు వెళ్లాడన్నారు. గొర్రెలను మేపుతుండగా ప్రమాదవశాత్తు పాము కాటుకు గురయ్యారన్నారు. పక్కన పొలంలో పనిచేస్తున్న కుటుంబ సభ్యులు వెల్దుర్తి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కొరకు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అన్నారు. చికిత్స పొందుతూ కోల్కోలేక బోయ సుంకన్న మృతి చెందినట్లు వారు తెలిపారు. భార్య బోయ శివమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. కుటుంబ యజమాని మరణించడంతో తాము రోడ్డున పడకుండా తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

ట్రిపుల్ ఐటీ డీఎం విద్యా సంస్థ ఆధ్వర్యంలో

ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థ రూపకల్పన

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : కర్నూలు ట్రిపుల్ ఐటీ డీఎం విద్యా సంస్థ ఆధ్వర్యంలో డ్రోన్ ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థ రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో ట్రిపుల్ ఐటీ డీఎం ఆధ్వర్యంలో రూపొందుతున్న డ్రోన్ ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థకు సంబంధించిన ప్రదర్శనను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రోగుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని తక్షణ వైద్య సదుపాయం అందించేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందన్నారు. ఘటనా స్థలంలోనూ, ఆసుపత్రికి వెళ్తున్న సమయంలోను రోగుల పరిస్థితిని వైద్యులు ప్రత్యక్షంగా పర్యవేక్షణ చేసి, వైద్య సేవలు అందించేందుకు ఈ వ్యవస్థ ఎంతగానో తోడ్పడుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ వ్యవస్థ వైద్యులు, ఆసుపత్రుల మధ్య రియల్ టైం కమ్యూనికేషన్ నెట్వర్క్ ఏర్పరుస్తుందన్నారు. అత్యవసర హెచ్చరికలు, గ్రీన్ ఛానల్ సమయంలో అంబులెన్స్‌కు రూట్ క్లియర్ చేసేందుకు కూడా ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు. కర్నూలు ట్రిపుల్ ఐటీ డీఎం ప్రొఫెసర్లు, విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ వ్యవస్థను రూపొందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రదర్శనను పరిశీలించి, త్వరలోనే పూర్తిస్థాయిలో ఈ వ్యవస్థను రూపొందించాలని కలెక్టర్ ట్రిపుల్ ఐటీ డీఎం అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థను రూపొందిస్తున్న ట్రిపుల్ ఐటీ డీఎం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ కె.కృష్ణ నాయక్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డా.రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరులైన సీపీఐ నాయకులకు ఘన నివాళులు

విశాలాంధ్ర - కోడుమూరు: 24వ జిల్లా మహాసభలను పురస్కరించుకొని కోడుమూరు సీపీఐ అనుబంధ సంఘాలలో పనిచేస్తూ సేవలందించి అమరులైన కోడుమూరు సీపీఐ పట్టణ కార్యదర్శి గోవిందు, హమాలీ సంఘం అధ్యక్షుడు పులికొండలను స్మరించుకుంటూ వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక సీపీఐ కార్యాలయంలో సీపీఐ మండల కార్యదర్శి బి.రాజు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, హమాలీ సంఘం కార్మికులు అమరులైన గోవిందు, పులికొండల చిత్రపటాల వద్ద మౌనం పాటించి,వారి సేవలను గుర్తు చేసుకుంటూ ఉద్యమ నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ అమరులైన గోవిందు, పులికొండల ఆశయాల సాధనకు పార్టీలోని ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. అమరులైన గోవిందు, పులికొండల ఆశయాల జ్ఞాపకార్థం వారి పేరుపై రెండు ఎర్రజెండాలను జిల్లా మహాసభల్లో రాష్ట్ర నాయకత్వానికి అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు శ్రీరాములు, ఏడుకొండలు, మద్దిలేటి, బజారి పాల్గొన్నారు.

తనిష్క్‌లో 8, 9, 10 డైమాండ్ ప్రదర్శన

విశాలాంధ్ర- కర్నూలు: నగరంలో తనిష్క్ స్టోర్స్ ఆగస్టు 8, 9, 10వ తేదీల్లో డైమండ్ ఆభరణాల ఎగ్జిబిషన్, సేల్ శుక్ర వారం ప్రారంభం ప్రారంభించింది. భారత దేశంలో తనిష్క్ 450 స్టోర్స్ నుండి ఎంపిక చేసి సేకరించిన అద్భుతమైన డైమండ్ ఆభరణాల ఎగ్జిబిషన్, సేల్ ప్రారం భించింది. తనిష్క్‌లో డైమాండ్స్ ఎంతో నాణ్యమైన, మన్నిక కలిగిన, డైమాండ్స్‌ను ప్రదర్శనలో పెట్టింది. తమ విలువైన సమయాన్ని కేటా యించి ఈ ఎగ్జిబిషన్‌కు ప్రతి ఒక్కరూ వచ్చి తిలకించాలన్నారు. తమ కస్టమర్లు, తనిష్క యాజ మాన్యం ముప్పాధీరజ్ క్రిష్ణ, ముప్పా భరత్, షోరూం మేనేజర్ ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ మదర్‌థెరిసా సేవ పురస్కార్ అవార్డు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: మైక్స్ ఇంట ర్నేషనల్, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యు కేషన్ సొసైటీ సంస్థ వారు విద్యా రంగంలో విశేషమైన సేవలనందించి నందుకు గాను కర్నూలు బి.క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్‌కు ఇంటర్నేషనల్ మదర్ థెరిసా సేవ పురస్కార్ అవార్డును శుక్రవారం నాడు ఇ-మెయిల్ ద్వారా అంద జేశారు. మార్చి 2025 లో జరిగిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలలో కళాశాల విద్యార్థులు 82.02 శాతం ఉత్తీర్ణత సాధించినందుకుగాను, 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ ప్రథమ సంవ త్సరంలో 328 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందడానికి విశేషమైన కృషి చేసినందుకుగాను, కళాశాల ప్రిన్సిపాల్ ఈ అవార్డును అందు కున్నారు. ఈ సందర్భంగా కళాశాల టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ప్రిన్సిపాల్‌ను అభినందించారు.

దళిత యువకుడిపై వైసీపీ నాయకుల దాడి అమానుషం

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : తిరుపతిలో ఎస్సీ యువకుడిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అనుచరులు దాడి చేయడం అమానుషం అని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్ళ పాటు రాష్ట్రంలో అనేక అరాచకాలు సృష్టించిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారం కోల్పోయినా అదే ధోరణిని సాగిస్తున్నారని ఎంపీ మండిపడ్డారు. ఎస్సీలపై దాడి చేయడం వైసీపి నాయకులకు పరిపాటిగా మారిందన్నారు. గతంలో మాస్కులు అడిగిన పాపానికి ఎస్సీ కులానికి చెందిన డాక్టర్.సుధాకర్‌పై దాడి చేయడం, డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని చంపి డోర్ డెలివరీ చేయడంతో పాటు అనేక మంది దళితులపై దాడి చేశారన్నారు. తాజాగా బైక్ అద్దె చెల్లించలేదన్న కారణంతో భూమన అనుచరులు పవన్ కుమార్ అనే ఎస్సీ యువకుడి పై విచక్షణారహితంగా దాడికి పాల్పడడం దారుణమన్నారు.

వైసీపీ వారిని బట్టలు లేకుండా ఊరేగించాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: తిరుపతిలో భూమన కరుణాకర్ రెడ్డి కుటుంబం వారి అనుచరులు దళిత యువకునిపై దాడి చేయడాన్ని టీడీపీ పాలక మండలి సభ్యులు, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, డీసీఎంఎస్ అధ్యక్షులు వై.నాగేశ్వరరావుయాదవ్, కర్నూలు జిల్లా టీడీపీ ప్రధానకార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్‌లు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారిపై దాడులు తీవ్రంగా ఉండేవనీ వాటన్నింటికి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆయా వర్గాల వారిపై ఉన్న ద్వేషమే కారణమన్నారు. ఓట్లకోసం వారిని ఉపయోగించుకున్న జగన్, వారిపై దాడులను ప్రోత్సాహిస్తున్నారన్నారు. అధికారం కోల్పోయినా ఇంకా వారి నరమేదాన్ని ఆపడం లేదన్నారు. తిరుపతిలో దళిత యువకునిపై భూమన కరుణాకర్‌రెడ్డి కుమారుడు వైసీపీ వారు చేసిన నిర్బంధం. దాడే ఇందుకు నిదర్శనమన్నారు. ఇందుకు బాధ్యులైన వారిని పోలీసులు అరెస్టు చేయడమేకాక ఎంతో పవిత్రమైన తిరుపతి విధులను అపవిత్రం చేస్తున్న ఇలాంటి వారిని తిరుపతి నడిరోడ్డుపై బట్టలు లేకుండా తిప్పాలని వారు తిరుపతి ఎస్పీకి, పోలీస్ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. పవిత్రమైన తిరుమల తిరుపతిలో భూమన కరుణాకర్ రెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో వైసీపీ అనుచరులు ఒక దళిత యువకుడిపై చేసిన క్రూరమైన దాడిని ఖండిస్తున్నాము. తిరుపతిలో భూమన కరుణాకర్ రెడ్డి కుమారుడు అభినయ్ రెడ్డి కార్యాలయంలో వైసీపీ రౌడీలు ఒక దళిత యువకుడిని బంధించి, స్పృహ కోల్పోయే వరకు క్రూరంగా కొట్టారు. తిరుమల పవిత్రతను కాపా డేందుకు, సమాజంలో శాంతి భద్రతలను నెలకొల్పేందుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని, ఈ కిరాతకానికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

ఇచ్చిన హామీల అమలుకై కూటమి నేతలను నిలదీయండి

విశాలాంధ్ర - పెద్ద కడబూరు : ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కూటమి నేతలను నిలదీయాలని వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం రెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పీకలబెట్ట, గవిగట్టు, బాపులదొడ్డి, హులికన్వి గ్రామాల్లో మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి ఆదేశాల మేరకు సర్పంచులు నాగరాజు, చిన్న మహాదేవ, మహాదేవ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా కూటమి ప్రభుత్వం అమలు చేసిన, అమలు చేయాల్సిన హామీల గురించి ప్రతి ఇంటికి వెళ్లి వివరించారు. కూటమి ప్రభుత్వం పేదలకు అందాల్సిన పథకాలను అమలు చేయడంలో ఘోరంగా విఫల మైందని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా కూటమి నేతలు మోసం చేస్తున్నారని ఆరోపించారు. మండలంలో దాదాపు 700పైగా విద్యార్థులకు తల్లికి వందనం డబ్బులు జమ కాలేదన్నారు. ఒక్క హులికన్వి గ్రామంలోనే 30 మంది విద్యా ర్థులకు, ఏడవ తరగతి చదివే విద్యార్థి పేరు మీద ప్లాట్ లేకున్నా ప్లాట్ ఉందని ఒకే ఇంట్లో ముగ్గురు పిల్లలకు తల్లికివందనం డబ్బులు పడలేదని ఇది చాలా దారుణం అన్నారు. బూత్ కమిటీ తాలూకా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి ఈరన్న, దొడ్డిమేకల గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ యల్లప్ప, నాయకులు జాము వీరేష్ పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన లక్ష్మీదేవి ఆలయం

విశాలాంధ్ర - హొళగుంద: వరమహాలక్ష్మి పండుగ సందర్భంగా శుక్రవారం లక్ష్మీదేవి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు దేవికి పసుపు, కుంకుమార్చన, పూలహారాల వేసి నైవేద్యాలను సమర్పించి మహా మంగళ హారతితో పూజించారు. పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. వరమహాలక్ష్మి పండుగ సందర్భంగా లక్ష్మీదేవి ఆలయాన్ని ఆలయ నిర్వాహకులు రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో వరమహాలక్ష్మి పండుగను జరిపారు. నవ వధూవరులు లక్ష్మీదేవికి పూజలు చేసి ఆశీర్వాదం పొందారు. స్థానిక లక్ష్మీదేవి ఆలయంలో రైస్ మిల్ యజమానులు శివ శంకర గౌడ్, మురళీధర్ ఆచారి ఆధ్వర్యంలో లక్ష్మీదేవికి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీదేవి ఆలయంలో మహిళా భక్తులు అధికంగా పాల్గొన్నారు. పూజా కార్యక్రమంలో భక్తులు శివ శంకర గౌడ, మురళీధర్ ఆచారి పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలు

విశాలాంధ్ర - గూడూరు: శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా మహిళలు ఆలయాలు, నివాసాల్లో సాంప్రదాయ రీతిలో సామూహిక వరలక్ష్మి వ్రతాలను భక్తిశ్రద్ధలతో మహిళలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మండలంలోని కె.నాలాపురంలో వెలసిన శ్రీ సుంకల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈవో పీఎం రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించన సామూహిక వరలక్ష్మీ వ్రతాలను మహిళలు భక్తిశ్రద్ధలతో చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గూడూరు పట్టణంలోని శ్రీ సంతాన నాగమ్మ ఆలయంలో మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని సామూహిక వరలక్ష్మి వ్రతాలను చేపట్టారు. భక్తులు సమర్పించిన పట్టు వస్త్రాలను అమ్మవారికి అలంకరించి, కుంకుమార్చన చేశారు.

బంగారు ముక్కపుడక విరాళం

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల కేంద్రమైన పెద్ద కడబూరులో గ్రామంలో వెలసిన శ్రీశ్రీ పెద్ద లక్ష్మమ్మ దేవికి గ్రామానికి చెందిన గున్న రామకృష్ణ, జ్యోతి కుటుంబం అమ్మవారికి నూతన పట్టు వస్త్రాలు, ఒడి బియ్యం, ముక్కుపుడకను ఆలయ పూజారి విశ్వ బ్రాహ్మణ నరసింహాచారికి అందజేశారు. విశ్వ వాసు నామ సంవత్సరం శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా మొక్కుబడిగా తెచ్చిన పట్టు వస్త్రాలు, బంగారు ముక్కు పుడకను అమ్మవారికి అలంకరించి, ధూప దీప నైవేద్యములు సమర్పించారు. పూజా కార్యక్రమంలో బోయ గున్నన్న కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొని మొక్కలు తీర్చుకున్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ గంగాధర్

విశాలాంధ్ర - ఆస్పరి : ఆస్పరి యుపిఎస్ పోలీస్ స్టేషన్ సీఐగా ఎ.గంగాధర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ మస్తాన్ వలిని కర్నూలు వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కర్నూలు వీఆర్‌లో ఉన్న ఎ.గంగాధర్‌ను సీఐగా జిల్లా ఉన్నతాధికారులు నియమించారు. ఈ సందర్భంగా ఉదయం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ గంగాధర్ మాట్లాడుతూ ఆస్పరి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. శాంతి భద్రతల విషయంలో రాజీలేకుండా పనిచేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. మట్కా, గుట్కా, పేకాట, ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తేలేదన్నారు.

బదిలీ అయిన సీఐకి ఘన సన్మానం : స్థానిక పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించి బదిలీపై కర్నూలు వీఆర్‌కు వెళతున్న సీఐ మస్తాన్ వలిని శుక్రవారం సాయంత్రం మండల ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, పోలీస్ సిబ్బంది శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తులు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నూతన సీఐ ఎ.గంగాధర్, ఎస్సై మన్మథ విజయ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వీరభద్రేశ్వర స్వామి ఉత్సవాలకు తరలిరండి

విశాలాంధ్ర - హొళగుంద: మండలంలోని పెద్దహ్యాట వీరభద్రస్వామి ఉత్సవాలకు ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని పురోహితుడురాచయ్య స్వామి విజ్ఞప్తి చేశారు. పదోన ఘన హోమం, రుద్ర హోమ కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. 11 తేదీన శివశక్తి గంగా పూజ, ముత్తైదువుల కళాసా ల ఊరేగింపు, రుద్రాభిషేకం, ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరుగుతాయని మధ్యాహ్నం 12:30 గంటల నుండి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. స్వామి వారి ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని ప్రతి ఏటా శ్రావణమాసంలో జరిగే ఉత్సవాల సందర్భంగా స్వామివారి ఉత్సవాలు నిర్వహిస్తామని రాత్రి భజన కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

బాల నాగన్న సేవలు ఎనలేనివి

విశాలాంధ్ర - ఆదోని : సీపీఐ బలోపేతం కొరకు ఆదోని నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యల పరిష్కారం, కార్మిక సమస్యల కొరకు పోరాటాలు చేసి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలలో మంచి గుర్తింపు తెచ్చుకున్న మహనీయుడు కీర్తిశేషులు బి.బాల నాగన్న అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు కొనియాడారు. బాల నాగన్న 14వ వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో పట్టణ మండల సమితి ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాలు లేసి నివాళులు అర్పించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు, పట్టణ, మండల కార్యదర్శి టి.వీరేష్, కల్లు బావి రాజు మాట్లాడుతూ కామ్రేడ్ బాల నాగన్న పార్టీకి ఎనలేని సేవలు చేశారని కొనియదారు. సీపీఐ జిల్లా సమితి సభ్యులు సుదర్శన్ విజయ్, ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వెంకన్న, హుసేని, షేక్షావలి, జిల్లా సహా కార్యదర్శి ఓబీ నాగరాజు, రైతు సంఘం నాయకులు బసాపురం గోపాల్, మదిరి, ఎల్లప్ప, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొత్తూరు గంగన్న, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు సత్య నారాయణ, పార్టీ నాయకులు కొత్తూరు ఈరన్న, మరాటి గిరి, నాగరాజు, అనుమప్ప పాల్గొన్నారు.

ఏళ్లు గడుస్తున్నా విద్యుత్ వైర్లు బిగించడం లేదు...

విశాలాంధ్ర - హొళగుంద: హొళగుంద నుండి బళ్ళారి రోడ్డుపై వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తున్నాయి. స్థానిక విద్యుత్ కార్యాలయం నుండి జెడ్పీ హైస్కూల్ కాంపౌండ్ గోడ పక్కన క్రాసింగ్ వైర్ల కోసం విద్యుత్ స్తంభాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఏళ్లు గడుస్తున్నప్పటికీ విద్యుత్ స్తంభాలు అలంకార ప్రాయంగా ఉన్నాయంటూ ప్రజలు విలేకరులతో తమ ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపై అధిక లోడుతో తిరిగే వాహనాలకు విద్యుత్ వైర్లు తగిలి ప్రమాదం జరిగిన సంఘటనలు అనేకమని, విద్యుత్ వైర్లు వాహనాలకు తగలడం వల్ల నిప్పురవ్వలు ఎగిసిపడుతున్నాయని, దీంతో తాము భయంతో ఆందోళన చెందుతున్నామని ప్రజలు వాపోతున్నారు. విద్యుత్ స్తంభాలకు క్రాసింగ్ వైర్లను బిగిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవని, అధికారులు నిర్లక్ష్యంతోనే వైర్లు బిగించకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రతి రోజు 2 వేల మంది విద్యార్థులు విద్యాభ్యాసం కోసం వస్తున్నారని, ప్రభుత్వ కార్యాలయాల దగ్గరకు పనుల కోసం ఎంతో మంది గ్రామీణ ప్రాంతాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో రోడ్డుపై రాకపోకలు జరుపుతున్నారు. ఉభయ రాష్ట్రాల ప్రజలకు అనుసంధానం చేసే రోడ్డు కావడంతో ఎప్పుడు వాహనాలు రద్దీ అధికంగా ఉంటుంది. గ్రామంలో క్రాసింగ్ వైర్ల కోసం విద్యుత్ స్తంభాలను పాతి, వదిలేశారని, విద్యుత్ వైర్లను బిగిస్తే ఎంతో మేలు జరుగుతుందని వారు కోరుతు న్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసు కుని, వెంటనే క్రాసింగ్ వైర్లను బిగించి, నిర్లక్ష్యాన్ని విడనాడాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, శనివారం 09, ఆగస్టు 2025

పెట్టుబడి యాప్‌ల పేరుతో సైబర్ నేరగాళ్ల మోసాలు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: ఇటీవల రకరకాల వంటి పెట్టుబడి యాప్‌లు, సోషల్ మీడియా, టెలిగ్రామ్ గ్రూపులు, వాట్సాప్ ద్వారా ప్రచారం చేస్తూ ప్రజలను సైబర్ నేరగాళ్ళు మోసం చేస్తున్న ఘటనలు జిల్లాలో ఇటీవల వెలుగులోకి వచ్చాయని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక లాభాలు వస్తాయనే ఆశ చూపిస్తూ ఈ యాప్‌ల ద్వారా లక్షల రూపాయలు వసూలు చేసి, అనంతరం మూసివేస్తున్నారన్నారు. యాప్‌ల ద్వారా వందశాతం లాభం, రోజుకి 3-5శాతం రిటర్న్స్ వంటి వాగ్దానాలు, మొదట్లో చిన్న మొత్తాలపై లాభాలు చూపించి, నమ్మకాన్ని కల్పించడం. ఆపై పెద్ద మొత్తాలను డిపాజిట్ చేయమని ఒత్తిడి చేయడం, డబ్బు పంపిన తరువాత యాప్ లేదా వెబ్సైట్ పని చేయకపోవడం జరుగు తుందన్నారు. మోసగాళ్లు విదేశీ నంబర్లు, ఫేక్ కెవైసీ డాక్యుమెంట్లు ఉపయోగించడం. పెట్టుబడులు చేసే ముందు సంబంధిత కంపెనీ లేదా యాప్ ఎస్ఈబీఐ, ఆర్ఈబీఐ గుర్తించిందా అనే దానిపై పరిశీలించాలి. వందశాతం లాభం, నష్టమేం ఉండదు' వంటి ప్రకటనలు మోసపూరితమవేఅన్నారు. టెలిగ్రామ్, వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే పెట్టుబడి సూచనలను పూర్తిగా నమ్మవద్దని, ఎటువంటి అనధికారిక లింకులు లేదా యాప్ లలో డబ్బులు ట్రాన్స్ఫర్ చేయవద్దని, సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ విజ్ఞప్తి చేశారు.

నేడే సీపీఐ జిల్లా మహాసభలు

ప్రదర్శన, బహిరంగ సభ

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: సీపీఐ కర్నూలు జిల్లా 24వ జిల్లా మహా సభలు శనివారం ప్రారంభం కానున్నాయి. ముందుగా ఉదయం 11 గం జిల్లా పరిషత్ నుండి పాతబస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వరకు బారీ ప్రదర్శన నిర్వహించను న్నారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్ వద్ద బారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ ప్రదర్శనకు జిల్లా నలుమూలల నుండి సీపీఐ నాయకులు, కార్యకర్తలు తరలిరానున్నారు. ప్రదర్శనలో ప్రజానాట్య మండలి కళాకారుల డప్పుచప్పుళ్ళు, కోలాటాలు, గొరవయ్యల నృత్యాలు, జనసేవాదళ్ కవాతు నిర్వహించనున్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, ఆహ్వానసంఘం అధ్యక్షులు జగన్నాథం, జి.చంద్రశేఖర్, సి.మహేష్, డి.శ్రీనివాస రావు, షాబీర్ బాష తదితరులు మహాసభల ఏర్పాట్లు, బహిరంగ సభ వేదిక, నగరంలోని ప్రధాన కూడళ్ళలో ఏర్పాటు చేసిన తోరణాలు, ఫ్లెక్సీ లను పరిశీలించారు. ఈ బహిరంగ సభలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, డి.జగదీష్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, ఆవుల శేఖర్, నక్కిలెనిన్ బాబు, జిల్లా నాయకులు పాల్గొన నున్నారు. బహిరంగ సభ అనంతరం పున్నమి రెస్టారెంట్‌లో మూడు రోజుల పాటు ప్రతినిధుల సభ నిర్వహించను న్నారు. ఈ జిల్లాలోని సీపీఐ, ప్రజా సంఘాలకు చెందిన సుమారు 250 మంది ప్రతినిధులు ఈ మహాసభల్లో పాల్గొంటారన్నారు.

మొండి గోడలకే పరిమితమైన కమ్యూనిటీ హాల్

విశాలాంధ్ర -హొళగుంద: మార్లమడకి గ్రామం, ఎస్సీ కాల నీలో మాజీ ఎమ్మెల్సీ మసాల పద్మజ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులను మంజూరు చేశారు. కాలనీలో కమ్యూనిటీ హాల్ పనులు చురుగ్గ సాగి భవనంపూర్తి కాక మొండి గోడలకి పరిమితమైందని ప్రజలు గుసగుసలాడుతున్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మిస్తే గ్రామ అభివృద్ధిపై చర్చించడం జరుగు తుందని, సామూహిక కార్యక్రమాలు ఇతర కార్యక్రమాలు జరుపుకోవ డానికి ఎంతో అనుకూలంగా ఉంటుందని గ్రామ ప్రజలు శుక్రవారం విలేకరులకు తెలిపారు. కమ్యూనిటీ హాల్ లేనందున స్థానిక దేవాల యాలు, రచ్చబండలు ఇతర బయలు ప్రదేశంలో కూర్చుని గ్రామా భివృద్ధిపై చర్చించు కుంటామంటున్నారు. కమ్యూనిటీ హాల్ పూర్తికాక మొండి గోడతో నిరుపయోగంగా ఉందని, విద్యావంత యువకులు తెలిపారు. ఇప్పటికైన సంబంధిత చర్యల అధికారులు చర్యలు తీసు కొని కమ్యూనిటీ హాల్ పూర్తిస్థాయిలో నిర్మించాలని ప్రజలు కోరారు.

టైలర్ల సంఘం జిల్లా కార్యదర్శి ఆకస్మిక మృతి

విశాలాంధ్ర - సి.బెళగల్: టైలర్ సంఘం జిల్లా కార్యదర్శి టి.ఆదెన్న (39) శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందారు. గత పది హేనేళ్లుగా టైలర్ సంఘంలో మండల సభ్యులుగా, మండల అధ్యక్షులుగా పని చేసి ఇటీవల జిల్లా కార్యదర్శి స్థాయికి ఎదిగారు. టైలర్ సంఘానికి, సభ్యులకు ప్రభుత్వం నుండి అనేక సంక్షేమ పథకాల కోసం, అభివృద్ధి కోసం కృషి చేశారు. ఆయన గత వారం రోజుల కిందట పచ్చ కామెర్లతో ఆసుపత్రిలో చేరి, చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందారు. ఈ విషయం తెలిసి టైలర్ సంఘానికి తీరని లోటని, టైలర్ల సంఘం సభ్యులు ఆయన మృతదేహానికి నివాళులు అర్పించారు.

పాము కాటికి మృతి చెందిన గొర్రెల కాపరి

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: గొర్రెల కాపరైన బోయ సుంకన్న (45) పాము కాటికి గురై మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రామకృష్ణా పురం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు బోయ సుంకన్న గొర్రెల కాపరిగా ఉంటూ వ్యవసాయం చేసు కొని కుటుంబాన్ని పోషిస్తూ ఉండేవాడు అన్నారు. ఈనెల 6 తారీకు ఉదయం గొర్రెలను మేపేందుకు మాల కొండ దగ్గర ఉన్న పొలం వైపు వెళ్లాడన్నారు. గొర్రెలను మేపుతుండగా ప్రమాదవశాత్తు పాము కాటుకు గురయ్యారన్నారు. పక్కన పొలంలో పనిచేస్తున్న కుటుంబ సభ్యులు వెల్దుర్తి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. ప్రధమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కొరకు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అన్నారు. చికిత్స పొందుతూ కోల్కోలేక బోయ సుంకన్న మృతి చెందినట్లు వారు తెలిపారు. భార్య బోయ శివమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. కుటుంబ యజమాని మరణించడంతో తాము రోడ్డున పడకుండా తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

ఇచ్చిన హామీల అమలుకై కూటమి నేతలను నిలదీయండి

విశాలాంధ్ర - పెద్ద కడబూరు : ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కూటమి నేతలను నిలదీయాలని వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం రెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పీకలబెట్ట, గవిగట్టు, బాపులదొడ్డి, హులికన్వి గ్రామాల్లో మంత్రా లయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి ఆదేశాల మేరకు సర్పంచులు నాగరాజు, చిన్న మహాదేవ, మహాదేవ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అమలు చేసిన, అమలు చేయాల్సిన హామీల గురించి ప్రతి ఇంటికి వెళ్లి వివరించారు. కూటమి ప్రభుత్వం పేదలకు అందాల్సిన పథకాలను అమలు చేయడంలో ఘోరంగా విఫల మైందని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా కూటమి నేతలు మోసం చేస్తున్నారని ఆరోపించారు. మండలంలో దాదాపు 700పైగా విద్యార్థులకు తల్లికి వందనం డబ్బులు జమ కాలేదన్నారు. ఒక్క హులికన్వి గ్రామంలోనే 30 మంది విద్యార్థులకు, ఏడవ తరగతి చదివే విద్యార్థి పేరు మీద ప్లాట్ లేకున్నా ప్లాట్ ఉందని ఒకే ఇంట్లో ముగ్గురు పిల్లలకు తల్లికివందనం డబ్బులు పడలేదని ఇది చాలా దారుణం అన్నారు. బూత్ కమిటీ తాలూకా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి ఈరన్న, దొడ్డిమేకల గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ యల్లప్ప, నాయకులు జాము వీరేష్ పాల్గొన్నారు.

సోదర బంధానికి ప్రతీక రక్షా బంధన్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : గౌరవం, నమ్మకం, సోదర బంధానికి ప్రతీక రక్షాబంధన్ అని ఎంపీ, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. ఢిల్లీ లోని పార్లమెంట్ ఆవరణలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రిజీజుతో ఎంపీల అల్పాహార విందు సమావేశం జరిగింది. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రిజీజుతో, తోటి పార్లమెంటు సభ్యులతో కలిసి అల్పాహారం విందు జరిగిందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చెప్పారు. ఈ విందు సమావేశం హృదయపూర్వకంగా, అంతర్దృష్టితో కూడిన సంభాషణ జరిపే అదృష్టం లభించిందన్నారు. కేంద్ర మంత్రి వినయం, ప్రజా సేవ పట్ల అంకితభావం, జాతీయ సమస్యలపై లోతైన అవగాహన నిజంగా స్ఫూర్తిదాయకమన్నారు. గౌరవం, నమ్మకం సోదర బంధానికి ప్రతీకగా ఉన్న రక్షా బంధాన్ని పురస్కరించుకొని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రిజీజుకు రాఖీ కట్టడం ఒక ప్రత్యేకమైన క్షణమని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

స్పందించిన ఆర్టీసీ అధికారులు

విశాలాంధ్ర - కోవెలకుంట్ల: కోవెలకుంట్ల ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం జలమయమై ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఆర్టీసీ జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేయడంతో స్పందించారు. డిపో మేనేజర్ నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రొక్లిన్ ఏర్పాటుచేసి బస్టాండ్ ఔట్ గెట్ నుంచి కాలువను ఏర్పాటు చేశారు. కాల్వను గ్రామపంచాయతీ డ్రైనేజీకి అనుసంధానం చేయడంతో బస్టాండ్ ఆవరణలో నీరు నిల్వచేరకుండా ఉంటుంది. ఆర్టీసీ అధికారుల చర్యలపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాంప్రదాయ బద్దంగా శ్రీశైల గిరి ప్రదక్షిణ

విశాలాంధ్ర - శ్రీశైలం: శ్రీశైలం మహా క్షేత్రంలో పౌర్ణమి పురస్కరించుకొని శ్రీశైల గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ఆలయ అర్చక స్వాముల సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. గంగాధర మండపం వద్ద స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రచార రథంపై వేంచింపచేయించి ప్రత్యేక పూజలు నిర్వహించి, గంగాధర్ మండపం నుండి నందిగుడి బయలు వీరభద్ర స్వామి ఆలయము వలయ రహదారి పంచమంటాలు రుద్రవనము తిరిగి, నంది గుడికి చేరుకుని, ఆలయ ప్రధాన వద్దకు చేరుకోవటంతో శ్రీశైల గిరి ప్రదర్శన ముగుస్తుంది. ధర్మ ప్రచారంలో భాగంగా భక్తుల్లో ఆధ్యాత్మిక భావన భక్తి భావాన్ని పెంపొందించేందుకు దేవస్థానం వారు ఈ గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగు తుంది. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు స్థానికులు పాల్గొన్నారు

ఘనంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలు

విశాలాంధ్ర - గూడూరు: శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా మహిళలు ఆలయాలు, నివాసాల్లో సాంప్ర దాయ రీతిలో సామూహిక వరలక్ష్మి వ్రతాలను భక్తిశ్రద్ధలతో మహిళలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మండ లంలోని కె.నాలాపురంలో వెలసిన శ్రీ సుంకల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈవో పీఎం రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించన సామూ హిక వరలక్ష్మీ వ్రతాలను మహిళలు భక్తిశ్రద్ధలతో చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గూడూరు పట్టణంలోని శ్రీ సంతాన నాగమ్మ ఆలయంలో మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని, సామూహిక వరలక్ష్మి వ్రతాలను చేపట్టారు. భక్తులు సమర్పించిన పట్టు వస్త్రాలను అమ్మవారికి అలంకరించారు.

బంగారు ముక్కపుడక విరాళం

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల కేంద్రమైన పెద్ద కడబూరులో గ్రామంలో వెలసిన శ్రీశ్రీ పెద్ద లక్ష్మమ్మ దేవికి గ్రామానికి చెం దిన గున్న రామకృష్ణ, జ్యోతి కుటుంబం అమ్మవారికి నూతన పట్టు వస్త్రాలు, ఒడి బియ్యం, ముక్కుపుడకను ఆలయ పూజారి విశ్వ బ్రాహ్మణ నరసింహాచారికి అందజేశారు. విశ్వ వాసు నామ సంవత్సరం శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా మొక్కుబడిగా తెచ్చిన పట్టు వస్త్రాలు, బంగారు ముక్కు పుడకను అమ్మవారికి అలంకరించి, ధూప దీప నైవేద్యములు సమర్పించారు. పూజా కార్యక్రమంలో బోయ గున్నన్న కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

శిథిలావస్థలో కల్వర్టు.. పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర -హొళగుంద: హొళగుంద నుండి కడ్లే మాగికి వెళ్లే రోడ్డు మధ్యలో కల్వర్టు శిథిలావస్థలో ఉంది. శిథిలావస్థలో ఉన్న కల్వర్టుపై కడ్లేమాగి, గజ్జెహల్లి, బంద్రాల్ తదితర గ్రామాల ప్రజలు రైతులు రోజు తిరుగుతున్నారు. బ్రిటిష్ కాలంలో నిర్మించిన రాతి కట్టడం కూలడానికి సిద్ధంగా ఉన్నదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కల్వర్టు నిర్మించాలంటూ ఎన్నోసార్లు అధికారులు దృష్టికి తీసుకొచ్చిన పెడచెవిన పెట్టేశారని, కల్వర్టు మాత్రం నిర్మించలేకపోయారని ప్రజలు విమర్శించారు. జగన్ కాలనీ ప్రజలు శిథిలా వస్థల కల్వర్టు దాటుకుంటూ వెళుతున్నారు. కోతి బసప్ప, ఇతర దేవాలయ దర్శనం కోసం భక్తులు భయం భయంగా నడుస్తూ స్వామి వారి దర్శనం చేసు కుంటున్నారు. గతంలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరై పనులు ప్రారంభించిన అధికారులు మాత్రం కల్వర్టు నిర్మించకుండా చేతులెత్తేసారని ప్రజలు విమర్శించారు. వర్షాకాలంలో కల్వర్టు అడుగు భాగాన భారీ స్థాయిలో వరద నీరు ప్రవహించి పాల చెరువుకు చేరుకుంటాయని ప్రజలు తెలిపారు. శిథిలావస్థలో ఉన్న కల్వర్టు కూలిపోతే ఇక రాకపోకలు పూర్తిగా స్తంభించిపోతాయని అన్నారు. సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని వెంటనే కొత్త కల్వర్టు నిర్మించి, రాకపోకలకు అనుకూలం చేయాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేశారు.

ట్రిపుల్ ఐటీ డీఎం విద్యా సంస్థ ఆధ్వర్యంలో

ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థ రూపకల్పన

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : కర్నూలు ట్రిపుల్ ఐటీ డీఎం విద్యా సంస్థ ఆధ్వర్యంలో డ్రోన్ ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థ రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో ట్రిపుల్ ఐటీ డీఎం ఆధ్వర్యంలో రూపొందుతున్న డ్రోన్ ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థకు సంబంధించిన ప్రదర్శనను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రోగుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని తక్షణ వైద్య సదుపాయం అందించేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందన్నారు. ఘటనా స్థలంలోనూ, ఆసుపత్రికి వెళ్తున్న సమయంలోను రోగుల పరిస్థితిని వైద్యులు ప్రత్యక్షంగా పర్యవేక్షణ చేసి, వైద్య సేవలు అందించేందుకు ఈ వ్యవస్థ ఎంతగానో తోడ్పడుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ వ్యవస్థ వైద్యులు, ఆసుపత్రుల మధ్య రియల్ టైం కమ్యూనికేషన్ నెట్వర్క్ ఏర్పరుస్తుందన్నారు. అత్యవసర హెచ్చరికలు, గ్రీన్ ఛానల్ సమయంలో అంబులెన్స్‌కు రూట్ క్లియర్ చేసేందుకు కూడా ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు. కర్నూలు ట్రిపుల్ ఐటీ డీఎం ప్రొఫెసర్లు, విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ వ్యవస్థను రూపొందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రదర్శనను పరిశీలించి, త్వరలోనే పూర్తిస్థాయిలో ఈ వ్యవస్థను రూపొందించాలని కలెక్టర్ ట్రిపుల్ ఐటీ డీఎం అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థను రూపొందిస్తున్న ట్రిపుల్ ఐటీ డీఎం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ కె.కృష్ణ నాయక్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డా.రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

దళిత యువకుడిపై వైసీపీ నాయకుల దాడి అమానుషం

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : తిరుపతిలో ఎస్సీ యువకుడిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అనుచరులు దాడి చేయడం అమానుషం అని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్ళ పాటు రాష్ట్రంలో అనేక అరాచకాలు సృష్టించిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారం కోల్పోయినా అదే ధోరణిని సాగిస్తున్నారని ఎంపీ మండిపడ్డారు. ఎస్సీలపై దాడి చేయడం వైసీపి నాయకులకు పరిపాటిగా మారిందన్నారు. గతంలో మాస్కులు అడిగిన పాపానికి ఎస్సీ కులానికి చెందిన డాక్టర్.సుధాకర్‌పై దాడి చేయడం, డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని చంపి డోర్ డెలివరీ చేయడంతో పాటు అనేక మంది దళితులపై దాడి చేశారన్నారు. తాజాగా బైక్ అద్దె చెల్లించలేదన్న కారణంతో భూమన అనుచరులు పవన్ కుమార్ అనే ఎస్సీ యువకుడి పై విచక్షణారహితంగా దాడికి పాల్పడడం దారుణమన్నారు.

భక్తులతో కిటకిటలాడిన లక్ష్మీదేవి ఆలయం

విశాలాంధ్ర - హొళగుంద: వరమహాలక్ష్మి పండుగ సందర్భంగా శుక్రవారం లక్ష్మీదేవి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు దేనికి పసుపు, కుంకుమార్చన, పూలహారాల వేసి నైవేద్యాలను సమర్పించి మహా మంగళ హారతితో పూజించారు. పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. వరమహాలక్ష్మి పండుగ సందర్భంగా లక్ష్మీదేవి ఆలయాన్ని ఆలయ నిర్వాహకులు రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో వరమహాలక్ష్మి పండుగను జరిపారు. నవ వధూవరులు లక్ష్మీదేవికి పూజలు చేసి ఆశీర్వాదం పొందారు. స్థానిక లక్ష్మీదేవి ఆలయంలో రైస్ మిల్ యజమానులు శివ శంకర గౌడ్, మురళీధర్ ఆచారి ఆధ్వర్యంలో లక్ష్మీదేవికి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీదేవి ఆలయంలో మహిళా భక్తులు అధికంగా పాల్గొన్నారు. పూజా కార్యక్రమంలో భక్తులు శివ శంకర గౌడ, మురళీధర్ ఆచారి పాల్గొన్నారు.

అమరులైన సీపీఐ నాయకులకు ఘన నివాళులు

విశాలాంధ్ర - కోడుమూరు: 24వ జిల్లా మహాసభలను పురస్కరించుకొని కోడుమూరు సీపీఐ అనుబంధ సంఘాలలో పనిచేస్తూ సేవలందించి అమరులైన కోడుమూరు సీపీఐ పట్టణ కార్యదర్శి గోవిందు, హమాలీ సంఘం అధ్యక్షుడు పులికొండలను స్మరించుకుంటూ వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక సీపీఐ కార్యాలయంలో సీపీఐ మండల కార్యదర్శి బి.రాజు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, హమాలీ సంఘం కార్మికులు అమరులైన గోవిందు, పులికొండల చిత్రపటాల వద్ద మౌనం పాటించి,వారి సేవలను గుర్తు చేసుకుంటూ ఉద్యమ నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ అమరులైన గోవిందు, పులికొండల ఆశయాల సాధనకు పార్టీలోని ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. అమరులైన గోవిందు, పులికొండల ఆశయాల జ్ఞాపకార్థం వారి పేరుపై రెండు ఎర్రజెండాలను జిల్లా మహాసభల్లో రాష్ట్ర నాయకత్వానికి అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు శ్రీరాములు, ఏడుకొండలు, మద్దిలేటి, బజారి పాల్గొన్నారు.

వైసీపీ వారిని బట్టలు లేకుండా ఊరేగించాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: తిరుపతిలో భూమన కరుణాకర్ రెడ్డి కుటుంభం వారి అనుచరులు దళిత యువకునిపై దాడి చేయడాన్ని టీడీపీ పాలక మండలి సభ్యులు, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, డీసీఎంఎస్ అధ్యక్షులు వై.నాగేశ్వరరావుయాదవ్, కర్నూలు జిల్లా టీడీపీ ప్రధానకార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్‌లు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో ఎసీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారిపై దాడులు తీవ్రంగా ఉండేవనీ వాటన్నింటికి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆయా వర్గాల వారిపై ఉన్న ద్వేషమే కారణమన్నారు. ఓట్లకోసం వారిని ఉపయోగించుకున్న జగన్, వారిపై దాడులను ప్రోత్సాహిస్తున్నారన్నారు. అధికారం కోల్పోయినా ఇంకా వారి నరమేదాన్ని ఆపడం లేదన్నారు. తిరుపతిలో దళిత యువకునిపై భూమన కరుణాకర్‌రెడ్డి కుమారుడు వైసీపీ వారు చేసిన నిర్బంధం. దాడే ఇందుకు నిదర్శనమన్నారు. ఇందుకు బాధ్యులైన వారిని పోలీసులు అరెస్టు చేయడమేకాక ఎంతో పవిత్రమైన తిరుపతి విధులను అపవిత్రం చేస్తున్న ఇలాంటి వారిని తిరుపతి నడిరోడ్డుపై బట్టలు లేకుండా తిప్పాలని వారు తిరుపతి ఎస్పీకి, పోలీస్ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. పవిత్రమైన తిరుమల తిరుపతిలో భూమన కరుణాకర్ రెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో వైసీపీ అనుచరులు ఒక దళిత యువకుడిపై చేసిన క్రూరమైన దాడిని ఖండిస్తున్నాము. తిరుపతిలో భూమన కరుణాకర్ రెడ్డి కుమారుడు అభినయ్ రెడ్డి కార్యాలయంలో వైసీపీ రౌడీలు ఒక దళిత యువకుడిని బంధించి, స్పృహ కోల్పోయే వరకు క్రూరంగా కొట్టారు. తిరుమల పవిత్రతను కాపా డేందుకు, సమాజంలో శాంతి భద్రతలను నెలకొల్పేందుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని, ఈ కిరాతకానికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ గంగాధర్

విశాలాంధ్ర - ఆస్పరి : ఆస్పరి యుపిఎస్ పోలీస్ స్టేషన్ సీఐగా ఎ.గంగాధర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ మస్తాన్ వలిని కర్నూలు వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కర్నూలు వీఆర్‌లో ఉన్న ఎ.గంగాధర్‌ను సీఐగా జిల్లా ఉన్నతాధికారులు నియమించారు. ఈ సందర్భంగా ఉదయం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ గంగాధర్ మాట్లాడుతూ ఆస్పరి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. శాంతి భద్రతల విషయంలో రాజీలేకుండా పనిచేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. మట్కా, గుట్కా, పేకాట, ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తేలేదన్నారు.

బదిలీ అయిన సీఐకి ఘన సన్మానం : స్థానిక పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించి బదిలీపై కర్నూలు వీఆర్‌కు వెళతున్న సీఐ మస్తాన్ వలిని శుక్రవారం సాయంత్రం మండల ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, పోలీస్ సిబ్బంది శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తులు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నూతన సీఐ ఎ.గంగాధర్, ఎస్సై మన్మథ విజయ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వీరభద్రేశ్వర స్వామి ఉత్సవాలకు తరలిరండి

విశాలాంధ్ర - హొళగుంద: మండలంలోని పెద్దహ్యాట వీరభద్రస్వామి ఉత్సవాలకు ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని పురోహితుడురాచయ్య స్వామి విజ్ఞప్తి చేశారు. పదోన ఘన హెూమం, రుద్ర హెూమ కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. 11 తేదీన శివశక్తి గంగా పూజ, ముత్తైదువుల కళాసా ల ఊరేగింపు, రుద్రాభిషేకం, ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరుగుతాయని మధ్యాహ్నం 12:30 గంటల నుండి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. స్వామి వారి ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని ప్రతి ఏటా శ్రావణమాసంలో జరిగే ఉత్సవాల సందర్భంగా స్వామివారి ఉత్సవాలు నిర్వహిస్తామని రాత్రి భజన కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

బాల నాగన్న సేవలు ఎనలేనివి

విశాలాంధ్ర - ఆదోని : సీపీఐ బలోపేతం కొరకు ఆదోని నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యల పరిష్కారం, కార్మిక సమస్యల కొరకు పోరాటాలు చేసి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలలో మంచి గుర్తింపు తెచ్చుకున్న మహానీయుడు కీర్తిశేషులు బి.బాల నాగన్న అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు కొనియాడారు. బాల నాగన్న 14వ వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో పట్టణ మండల సమితి ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాలు లేసి నివాళులు అర్పించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు, పట్టణ, మండల కార్యదర్శి టి.వీరేష్, కల్లు బావి రాజు మాట్లాడుతూ కామ్రేడ్ బాల నాగన్న పార్టీకి ఎనలేని సేవలు చేశారని కొనియదారు. సీపీఐ జిల్లా సమితి సభ్యులు సుదర్శన్ విజయ్, ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వెంకన్న, హుసేని, షేక్షావలి, జిల్లా సహా కార్యదర్శి ఓబీ నాగరాజు, రైతు సంఘం నాయకులు బసాపురం గోపాల్, మదిరి, ఎల్లప్ప, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొత్తూరు గంగన్న, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు సత్య నారాయణ, పార్టీ నాయకులు కొత్తూరు ఈరన్న, మరాటి గిరి, నాగరాజు, అనుమప్ప పాల్గొన్నారు.

ఏళ్లు గడుస్తున్నా విద్యుత్ వైర్లు బిగించడం లేదు...

విశాలాంధ్ర - హొళగుంద: హొళగుంద నుండి బళ్ళారి రోడ్డుపై వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తున్నాయి. స్థానిక విద్యుత్ కార్యాలయం నుండి జెడ్పీ హైస్కూల్ కాంపౌండ్ గోడ పక్కన క్రాసింగ్ వైర్ల కోసం విద్యుత్ స్తంభాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఏళ్లు గడుస్తున్నప్పటికీ విద్యుత్ స్తంభాలు అలంకార ప్రాయంగా ఉన్నాయంటూ ప్రజలు విలేకరులతో తమ ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపై అధిక లోడుతో తిరిగే వాహనాలకు విద్యుత్ వైర్లు తగిలి ప్రమాదం జరిగిన సంఘటనలు అనేకమని, విద్యుత్ వైర్లు వాహనాలకు తగలడం వల్ల నిప్పురవ్వలు ఎగిసిపడుతున్నాయని, దీంతో తాము భయంతో ఆందోళన చెందుతున్నామని ప్రజలు వాపోతున్నారు. విద్యుత్ స్తంభాలకు క్రాసింగ్ వైర్లను బిగిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవని, అధికారులు నిర్లక్ష్యంతోనే వైర్లు బిగించకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రతి రోజు 2 వేల మంది విద్యార్థులు విద్యాభ్యాసం కోసం వస్తున్నారని, ప్రభుత్వ కార్యాలయాల దగ్గరకు పనుల కోసం ఎంతో మంది గ్రామీణ ప్రాంతాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో రోడ్డుపై రాకపోకలు జరుపుతున్నారు. ఉభయ రాష్ట్రాల ప్రజలకు అనుసంధానం చేసే రోడ్డు కావడంతో ఎప్పుడు వాహనాలు రద్దీ అధికంగా ఉంటుంది. గ్రామంలో క్రాసింగ్ వైర్ల కోసం విద్యుత్ స్తంభాలను పాతి, వదిలే శారని, విద్యుత్ వైర్లను బిగిస్తే ఎంతో మేలు జరుగుతుందని వారు కోరుతు న్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసు కుని, వెంటనే క్రాసింగ్ వైర్లను బిగించి, నిర్లక్ష్యాన్ని విడనాడాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

మరిన్ని వార్తలు E-PAPERలో